సంక్షేమ పాలనకే మా దీవెనలు

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు మా దీవెనలు ఉంటాయని మహిళలు పేర్కొన్నారు. భక్తరపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని భక్తరపల్లిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌ను అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు సీఎం జగనన్న పాలనలో తమకు ఎంతో మేలు జరిగిందని మా దీవెనలు మళ్లీ జగనన్నకు ఉంటాయన్నారు. గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. టీడీపీ నాయకుల అసత్య ప్రచారాలను విని మోసపోవద్దని సూచించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి సీఎంగా చేసుకోవాలన్నారు. ప్రజలు తెలియజేసిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కారం చూపాలని ఉద్యోగులకు సూచించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, సర్పంచ్ కరియన్న, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీలు మూర్తి, శ్రీరామరెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ప్రకాష్, జిల్లా, మండల ఎస్సీ నాయకులు మంజునాథ్, లక్ష్మీనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, రంగనాథ్, తాలుకా బీసీ సెల్ అధ్యక్షుడు తిమ్మప్ప, నాయకులు నటరాజు,నారాయణప్ప, ఈశ్వర్, నాగరాజు, ఏఓ నరసింహమూర్తి, గ్రామ కార్యదర్శి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.





భక్తరపల్లిలో బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, 25వ వార్డులో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

సంక్షేమ పథకాల రూపకర్త సీఎం జగన్

హిందూపురం: సంక్షేమ పథకాల రూపకర్త సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. శుక్రవారం స్థానిక 25వ వార్డు ఇన్‌చార్జి కార్తీక్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, సచివాలయ, మున్సిపల్ అధికారులతో కలిసి మంగళిపేట, కోటా ఏరియాలో ఎమ్మెల్సీ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను వివరించడంతోపాటు బుక్‌లెట్ అందజేశారు. అలాగే ఆ ప్రాంతంలోని ప్రజల సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తూ పరిష్కర మార్గం చూపించారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది పనితీరును ఎమ్మెల్సీ అభినందించారు. అలాగే ఒక్కో వలంటీర్‌కు రూ.వెయ్యి కానుకగా అందించారు.

ఉత్తర కుమార ప్రగల్భాలు మానండి..

ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమా షూటింగ్‌లు, టీవీ షోల్లో ఉండి ఎమ్మెల్యేనన్న సంగతి మరిచిపోయారని ఎమ్మెల్సీ ఎద్దేవా చేశారు. గుర్తుచ్చినప్పుడు వచ్చి సినిమా డైలాగులతో ఉత్తర కుమారుడిలా బీరాలు పలకడం కాదని, హిందూపురంలో నివాసం ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. అలా చేయడానికి మీకు తీరకలేకపోతే ప్రజాప్రతినిధిగా అనర్హులన్నారు. ఆ స్థానాన్ని వదలి సినిమాలు చేసుకోవాలని ఇక్బాల్ విమర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అయూబ్, ముస్తక్, నాగేంద్రమ్మ, మల్లికార్జున, కో ఆప్షన్ సభ్యులు రహమత్, కాంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఇలియాజ్, ఫక్రుద్దీన్, శివ, నాగరాజు, దాదు, గీతమంజునాథ్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో భరోసా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలు మా కుటుంబానికి ఎంతో భరోసా కల్పించాయి. వైఎస్సార్ చేయూత రూ. 18,750 వేలు, రైతు భరోసా రూ.73 వేలు, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.82 వేలు చొప్పున ప్రభుత్వ పథకాల ద్వారా రూ. 1,73,750 లక్షలు లబ్ధి పొందాం.

– దొడ్డక్క, భక్తరపల్లి

సీఎంకు రుణపడి ఉంటాం



మా కుటుంబానికి వైఎస్సార్ పంటల బీమా రూ.4,819, రైతు భరోసా రూ.40,500 వేలు, వైఎస్సార్ ఆసరా రూ.34 వేలు, రైతు సున్నావడ్డీ రూ.3,115 వేలు, ఆరోగ్య ఆసరా రూ.2,250 వేలు, జగనన్న వసతి దీవెన రూ.20 వేలు, పింఛన్ కానుక రూ.1,07 లక్షలు, సున్నా వడ్డీ రూ.6796, విద్యా దీవెన రూ.35,425, ఆరోగ్య శ్రీ రూ.15 వేలు, వైఎస్సార్ చేయూత రూ.37,500 చొప్పున పథకాల ద్వారా మొత్తం రూ, 3,06427 లబ్ధి చేకూరింది. ఇంత మేలు చేసిన సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.

– సావిత్రమ్మ, భక్తరపల్లి

ప్రజలకు మంచి చేస్తున్న సీఎం



నేను వెంకటరమణ స్వామి గుడి పక్క వీధిలో ఉంటా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. పింఛన్‌తో పాటు ఈబీసీ నేస్తం పథకం, స్థలంతోపాటు ఇల్లు మంజూరైంది. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగు కాలాలపాటు చల్లగా ఉండాలి. ఆయన చేసిన మేలును జీవితాంతం మరువలేను.

– శాంతమ్మ , హిందూపురం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి

• ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సచివాలయ కన్వీనర్లు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కోరారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక విశ్రాంతి భవనంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి కన్వీనర్లు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఇందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగర వేయడానికి కష్టపడి పని చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగడానికి అవకాశం ఉంటుందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీలు కవిత, రాధమ్మ, ఈరన్న, జెడ్పీటీసీలు భూతరాజు, సరోజమ్మ, స్వారక్క, డైరెక్టర్లు, కన్వీనర్లు, వివిధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

వారానికోసారి డ్రై డే పాటించాలి

పరిగి: ప్రతి ఇంటా వారానికోసారి డ్రైడే పాటించాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచించారు. మండలంలోని కొడిగెనహళ్లి బీసీ కాలనీలో శుక్రవారం డ్రైడేపై కీటక జనిత వ్యాధులు–నివారణోపాయాలు అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ వన్నప్ప మాట్లాడుతూ.. ఇళ్లలోని తొట్టెలు, బిందెలు, పాత్రల్లో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉంచుకోరాదన్నారు. నీటి నిల్వ పెరిగే కొద్దీ అందులో రోగకారక క్రిములు, వ్యాధులు కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెందుతాయన్నారు. ఫలితంగా మనిషి శరీరంలో చేరి మామూలు జ్వరంతో పాటూ విషజ్వరాలు, దగ్గు, ఆయాసం, తదితర వ్యాధులు కలుగుతాయన్నారు. ఇళ్లతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న, సూపర్‌వైజర్లు వాసుదేవమద్యస్థ, రమణ, ఎంఎల్‌హెచ్‌పీ జయశ్రీ పాల్గొన్నారు.

ప్రతి వారం డ్రై డే పాటించాలి

రొళ్ల: మండల వ్యాప్తంగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మడకశిర మలేరియ సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆరోగ్య, ఆశా వర్కర్లు దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

అమరాపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. శుక్రవారం అమరాపురం, హేమవతి గ్రామాల్లో సిబ్బందితో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోహర్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యా ఆరోగ్యశాఖ అధికారులు

విభజన హామీలు సాధించుకుందాం

హిందూపురం టౌన్: ప్రజా సంఘాలు, వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాలు ఒక్కటై ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించుకుందామని ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధాని నరేంద్రమోదీ 2014 తిరుపతిలో చెప్పారన్నారు. కానీ ఇప్పటికీ హామీని అమలు చేయలేదని వారు మండిపడ్డారు. అలాగే విభజన చట్టంలో పేర్కొన్న వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి అబద్ధపు హామీలు ఇస్తున్నారన్నారు. విభజన చట్టంలోని హామీల సాధన కోసంఈ నెల 20 నుంచి హిందూపురం నుంచి ఫిబ్రవరి 5న ఇచ్ఛాపురం వరకూ బస్సు యాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘం నాయకులు బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్, రవికుమార్, అఖిలాష, మూర్తి, చంద్రశేఖర్, హర్ష కుమార్, వంశీ, భగత్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో ఐక్యతను చాటుతున్న నాయకులు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకుందాం

పెనుకొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పేర్కొన్నారు. పట్టణంలోని మూడో సచివాలయంలో శుక్రవారం 18వ వార్డులో డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, పారిశుధ్య చర్యలు చేపట్టిందన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మెన్లు సునీల్, నందిని, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహులు, కౌన్సిలర్లు సద్దాం, రఘునాథరెడ్డి, తయూబ్, , రామాంజనేయులు, గణేష్, శ్రీరాములు, ఫరీద్, క్రిష్టప్ప, యాసిన్, మండల అగ్రి సలహాదారు. కొండలరాయుడు సచివాలయ సిబ్బంది రాధ, లావణ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు జయశంకరరెడ్డి పాల్గొన్నారు.



డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్

రూ.8,971 రికవరీకి ఆదేశం

పరిగి: మండలంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖ తరపున మంజూరైన నిధులతో జరిగిన పనులపై వారం రోజులుగా మండలంలో సామాజిక తనిఖీ చేపట్టిన విషయం తెలిసిందే. శుక్రవారం 14, 15వ విడతలకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. కార్యక్రమానికి డ్వామా పీడీ రామాంజనేయులు హాజరయ్యారు. ఎంపీడీఓ సరస్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.17 కోట్లు, పంచాయతీ రాజ్, సెర్ప్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల నుంచి మంజూరైన 5.53 కోట్లతో మొత్తం 22.57 కోట్ల నిధులతో జరిగిన పనులకు అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రూ.8,971లు దుర్వినియోగమైనట్లు అధికారులు తేల్చారు. ఈ నిధులను వెంటనే రికవరీ చేయాలని క్షేత్రస్థాయి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ శివానందనాయక్, ఎస్ఆర్పీ లోకేష్ పాల్గొన్నారు.



పనుల వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

సినిమా థియేటర్లపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: నిబంధనలు పాటించని, ప్రేక్షకులకు కనీస వసతులు కల్పించని సినిమా థియేటర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ సినిమా హాల్ వద్ద పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారే తప్ప, వాహనాలకు, అందులోని వస్తువులకు ఎలాంటి భద్రత లేదన్నారు. వస్తువులు పోయినా థియేటర్ వారు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, కనీసం సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదన్నారు. సినిమా టికెట్లు రూ.200 చొప్పున అధికంగా అమ్ముకుంటూ వ్యాపారమే ధ్యేయంగా థియేటర్ యజమానులు భావిస్తున్నారని, థియేటర్‌లో తాగడానికి నీరు, మరగదొడ్లలో నీటి సౌకర్యం లేదన్నారు. పరిమితికి మించి ప్రేక్షకులను పంపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇలాంటి థియేటర్ యజమానులపై చర్యలు తీసుకుని, సినిమా థియేటర్ల చట్టాన్ని అమలు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ః సీఐటీయూ నాయకులు నరసింహప్ప, రామకృష్ణ, అత్తర్ బాబా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, నరేష్, రఫీక్, నగేష్, లక్ష్మీపతి, నగేష్, నవీన్ ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

చిలమత్తూరు: మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్ఐ శ్రీనివాసులు వాహనదారులకు సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన 44 నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురుపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు..



డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

లేపాక్షిలో ‘పొలంబడి’

లేపాక్షి: మండల కేంద్రంలోని రైతు గోవిందప్ప పొలంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శ్రీలత మాట్లాడతూ సమగ్ర సస్య రక్షణ ద్వారా అధిక దిగుబడి సాధ్యమన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలు గురించి వివరించారు. టోల్‌ఫ్రీ నంబర్ 155251 కు ఫోన్ చేసి పంటల సాగుపై సలహాలు, సందేహాలు నివృతి చేసుకోవచ్చని రైతులకు సూచించారు. విద్యుత్, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖ అధికారులు వారి శాఖల్లో అమలువుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

చౌక దుకాణాల తనిఖీ

పుట్టపర్తి అర్బన్: నగర పంచాయతీ పరిధిలోని గోవిందపేట, పెద్దబజారులోని చౌకధాన్యపు దుకాణాలను శుక్రవారం పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. స్కేలును పరిశీలించి తూకాల్లో మోసం చేయొద్దని డీలర్లను హెచ్చరించారు. ఎండీయూ ఆపరేటర్లను అనుసంధానం చేసుకుని లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి బియ్యం అందించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందజేస్తున్నాయన్నారు. అక్కడే ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి, సక్రమంగా బియ్యం అందజేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బియ్యం, చెక్కెర, బేడలకు డీడీలు తీసి తెప్పించుకోవాలన్నారు.

క్లుప్తంగా

సంస్కృతి పరిరక్షణలో మహిళలే కీలకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సణ్ణ నాగప్ప

పావగడ: సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో మహిళలే కీలక పాత్ర పోషిస్తున్నారని స్థానిక చరిత్ర పరిశోధకుడు సణ్ణ నాగప్ప తెలిపారు. శ్రీ క్షేత్ర ధర్మస్థల సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో శుక్రవారం నిర్వహించిన జ్ఞాన వికాస సదస్సులో ఆయన మాట్లాడుతూ మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు ఆచారాలు నేటి యువతరం మరచిపోతున్నారన్నారు. మహిళలే తమ పిల్లలకు సంస్కృతి సంప్రదాయాలు నేర్పించాలన్నారు. జ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. పిల్లలకు ఆస్తి చేయకూడదని, పిల్లలనే ఆస్తిగా చేయాలన్నారు. ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్, సీఐ అజయ్ సారథి, ధర్మస్థల సంఘం డైరెక్టర్ దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ బుకింగ్ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమీనన్

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది రబీలో రైతులు సాగు చేసిన వివిధ పంటల ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్ కోరారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో డివిజన్ స్థాయి వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ- క్రాప్ బుకింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి రైతుల ఈ కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని కోరారు. ఈవిషయంలో రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. ఆర్బీకేల్లో ఎరువులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఏఓలు, ఏఈఓలు, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు, ఎంపీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే పనుల పరిశీలన

సోమందేపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను డీపీఓ విజయ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇంటి స్థలాలు, పంచాయతీ రోడ్లు తదితర వివరాలను రీ సర్వే రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. వీఆర్ఓ, గ్రామ సర్వేయర్, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజు రావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మడకశిర రూరల్: జిల్లెడుగుంట గ్రామానికి చెందిన నర్సేగౌడు అనుచరులతో టీడీపీని వీడి శుక్రవారం భక్తరపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరామని నర్సేగౌడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, సర్పంచ్ కరియన్న ఉన్నారు.

చెరుకులకు గిరాకీ



చెరుకులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

పావగడ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో సందడి నెలకొంది. స్థానిక శని మహాత్మ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన పలు చెరుకుల అంగళ్ల వద్ద చెరుకుల కొనుగోలుకు జనం గుమి గూడారు. ఒక్కో చెరుకు గడ రూ.150, వేరుశనగ కాయ కేజీ రూ 100, అనపకాయ రూ.60, గెనుసుగడ్డలు రూ.60 వరకు పలికాయి. కర్ణాటకలో సంక్రాంతి స్పెషల్ పదార్థం ఎల్లు, బెల్ల(నువ్వులు, బెల్లం) మిశ్రమం ఎక్కువగా విక్రయించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్యమహిళలు

పెనుకొండ: పట్టణంలో వాసవీమాత ఆలయంలో శుక్రవారం గోదాదేవి కల్యాణం ఘనంగా జరిగింది. ధనుర్మాసంలో గోదాదేవి కళ్యాణం జరిపిస్తే సర్వత్రా మంచి జరుగుతుందన్నది భక్తుల నమ్మకం. కల్యాణంలో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు సుధాకరగుప్తా, యాడికి నాగరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించండి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని సబ్ యూనిట్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. శుక్రవారం కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుళ్లసముద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు అందించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులు, దోమల నివారణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగమ్మ, గ్రామ కార్యదర్శి మారుతి ప్రసాద్, డాక్టర్ వినోద్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోలీస్ స్టేషన్ భవనం



పోలీస్ స్టేషన్ పై కప్పు పెచ్చులూడిన దృశ్యం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట పోలీస్ స్టేషన్ శిథిలావస్థ కు చేరుకుంది. స్టేషన్ లోని కంప్యూటర్ గది పై కప్పు బాగా దెబ్బతిని సిమెంటు పెచ్చులూడి అక్కడున్న మహిళా కానిస్టేబుల్ చౌడమ్మ తలపై పడుతుండగా అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్ ఆమెను రక్షించాడు. అయితే టేబుల్ పై ఉన్న కంప్యూటర్‌పై పెచ్చులు పడటడంతో పూర్తిగా దెబ్బతింది. మొత్తం భవనం పై కప్పు పూర్తిగా దెబ్బ తిని పెచ్చులు పెద్ద ఎత్తున్న ఊడి పడుతుండడంతో పోలీసులు, కంప్యూటర్ ఆపరేటర్లు భయాందోళనకు గురవుతున్నారు. సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన పోలీస్ స్టేషన్ శిథిలావస్థ కు చేరుకుందని వెంటనే కొత్త భవనం నిర్మించాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

రొళ్ల: ఉపాధి హామీ పనులను నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ఉన్న ఊళ్లలో ఉపాధి పొందేలా చూడాలన్నారు. కూలీల హాజరును ఎన్ఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో చేస్తేనే బిల్లులు అందుతాయన్నారు. ప్రతి కూలీకి రోజుకు రూ.257 బిల్లులు అందేలా చూడాలన్నారు. ఏపీఓ నాగరాజు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

శిరివరంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకట చిరంజీవి వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. రక్తహీనత వలన కలిగే నష్టాలు, పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ స్వరాణి, ప్రసాద్, అంజి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, తీర్థప్రసాద వినియోగం, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఆలయంలో పర్యాటకుల సందడి చోటు చేసుకోవడంతో అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించారు.